క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి

పట్నంబజారు వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ సూచించారు. ఈ మేరకు గురువారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించి బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, మణిపురం ఓవర్‌బ్రిడ్జి, వాసవి కాంప్లెక్సు ప్రాంతం, పొన్నూరు రోడ్డు, హిమని సెంటర్, మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, పేరేచర్ల బస్టాండ్, ఎత్తురోడ్డు, రామనామ క్షేత్రం రోడ్డు, నల్లచెరువు, ఏటుకూరు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా ధ్రువీకరించారు. ఇటీవల కాలంలో అధిక ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లు, డివైడర్లు, స్టాప్‌బోర్డు, సీసీ కెమెరాలు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్, ఎస్సై రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పట్నంబజారు అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే నల్లమేకల రమణకుమారి (25) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో ఆమె పెదనాన్న అంగలూరి సుబ్రహ్మణ్యం ఆమెను పెంచి పెద్ద చేశారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలానికి తెల్లమేకల ప్రశాంత్‌తో 2024లో వివాహం చేశారు. గుంటూరులోని పెదనాన్న నివాసంలో ఎలుకల మందు తినగా, బంధువులు చూసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దరాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు గుంటూరు నగరానికి చెందిన కొంత మంది యువకులు గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వైజాగ్ నుంచి రైలులో గంజాయి తీసుకొస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. అరకు నుంచి గుంటూరుకు చెందిన సాయిరామకృష్ణ అనే వ్యక్తి మూడున్నర కిలోల గంజాయి తీసుకుని గుంటూరు వచ్చి న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద తన స్నేహితులు ముక్కోటి రవి, యూసూబ్‌లకు చెరో కిలో ఇస్తున్న నేపథ్యంలో వారిని పట్టుకున్నారు. వారి నుండి మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

మిర్చి వ్యాపారి ఆత్మహత్య

పట్నంబజారు డబ్బులు రాలేదన్న మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌లో నివాసం ఉండే జడా నాగరాజు (40) మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. కొద్ది కాలం క్రితం కర్నూలు జిల్లాకు సంబంధించిన వ్యాపారులకు 610 బ్యాగుల మిర్చి పంపాడు. దానికి సంబంధించి సుమారు రూ. 27 లక్షలకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. సదరు కర్నూలు వ్యాపారులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన నాగరాజు ఈ నెల 26న గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



నగరంపాలెం: ఇటీవల వేర్వేరుగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.చంద్రశేఖరరావు, కానిస్టేబుల్ షేక్ ఇమ్రాన్‌వలి మరణించారు. ఈ మేరకు చేయూత పథకం కింద చంద్రశేఖరరావు భార్య జ్యోతి, ఇమ్రాన్‌వలి భార్య మైమూనలకు రూ.లక్ష చొప్పున చెక్కులను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైలా సాంబశివరావు, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి హుస్సేన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కేంద్రాలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే నిర్వహించాలని ఆదేశాలు చేసింది. ఆ కాసేపు కూడా సిబ్బంది విధులు నిర్వహించడానికి చాలా కష్టపడుతున్నారు. మొక్కుబడిగా వచ్చి హాజరు వేసుకుని వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. మరికొంత మంది టీచర్లు ఇతర ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ



ముత్యాలరెడ్డి నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంతో పిల్లలను చూసుకుంటున్న ఆయా

- సకాలంలో రాని అంగన్‌వాడీ టీచర్లు
- కొన్నిచోట్ల ఆయాలను కూర్చోబెట్టి వేరే పనులు
- పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్న వైనం
- ఐసీడీఎస్ అధికారుల అండతో అక్రమాలు

నెహ్రూనగర్: అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుంది. సకాలంలో వాటిని తెరిచిన పరిస్థితి కనిపించడం లేదు. ఒక వేళ తెరిచినా టీచర్లు ఉండటం లేదు. ముందుగా ఆయాలు వచ్చి స్కూల్ ఓపెన్ చేసుకుని స్థానికంగా ఉండే చిన్నారులను స్కూల్‌కి తీసుకువచ్చిన తరువాత టీచర్‌కు ఫోన్ చేస్తే తీరికగా 10.30 గంటలకుపైగా విధులకు హాజరవుతున్నారు. 12 గంటల వరకు కూడా ఉండటం లేదు. ఏవో పనుల పేరుతో ఆయాలను స్కూల్‌లో పెట్టి టీచర్లు బయటకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆయాలే చిన్నారులకు ప్రీ స్కూల్ పాఠాలు, పౌష్టికాహారం అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

పాత ఫొటోలతో సరిపుచ్చుతూ...

సమయానికి రాకున్నా వచ్చినట్లుగా పాత ఫొటోలు పలు యాప్‌లలో నమోదు చేసుకుని పబ్బం గడుపుతున్నారనే ఆరోపణలు టీచర్లపై ఉన్నాయి. కొంత మంది స్కూల్ చిన్నారుల ఎన్‌రోల్ తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువగా చూపించడం, పాత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం పరిపాటిగా మారింది. మిగిలిన సరకులను (గుడ్లు, కందిపప్పు, నూనె, తదితరాలు) బయట విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల అండతోనే...

ఐసీడీఎస్ అధికారులు అడిగిన గిఫ్టులు ఇస్తే టీచర్లపై, ఆయాలపై ఎలాంటి చర్యలు ఉండవనే విమర్శలు వినిపిస్తున్నాయి. గిఫ్టులు ఇచ్చిన టీచర్లు సకాలంలో స్కూల్‌కి రాకపోయినా.. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయకపోయినా... సెలవులు పెట్టినప్పటికీ విధుల్లో ఉన్నట్లే చూపుతూ వారిని కాపాడుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. బ్రాడీపేటలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ భర్త రేషన్ డీలర్ కావడంతో సదరు పౌష్టికాహారం ఇలా పక్కదారి పట్టిస్తున్నారు. ముత్యాలరెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో రాత్రి సమయంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దెకు ఇస్తున్నప్పటికీ ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. ఇదే పరిస్థితి గుంటూరు అర్బన్ వ్యాప్తంగా ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

గుంటూరు అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు 321

ఆరు నెలలలోపు వారి సంఖ్య	– 2,927
ఆర్నెల్లు నుంచి సంవత్సరంలోపు వారు	– 3,947
ఏడాది నుంచి 3 ఏళ్లలోపు వారు	– 15,373
మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు వారు	– 15,958

నిర్ణీత సమయంలో కేంద్రంలోనే ఉండాలి

ప్రస్తుతం ఎండలు దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిగంటలుగా నిర్ణయించాం. ఆ సమయంలో తప్పనిసరిగా సిబ్బంది కేంద్రంలో ఉండాలి. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. పౌష్టికాహారం పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తప్పవు.

– కృష్ణవేణి, సీడీపీఓ, ఐసీడీఎస్

మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్ల నిర్వహణకు వేలం



టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్న అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మరుగుదొడ్లు, మార్కెట్లు, సైకిల్ స్టాండ్‌లకు సంబంధించి మార్చి 31వ తేదీ వరకు లీజు నిర్వహించుకోవడానికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం వివరాలను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు.. డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. నగరపాలక సంస్థకు చెందిన 14 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం చేపట్టారు. 13 ప్రాంతాల్లో టెండర్ దాఖలు చేశారని, పాల ఆసుపత్రి వద్ద మరుగుదొడ్లకు ఎవరూ పాల్గొనలేదన్నారు. టెండర్‌లో పాల్గొని, అధిక బిడ్ దాఖలు చేసిన వాటిని ఆమోదం కోసం కమిషనర్‌కి, స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రెహ్మాన్ పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం కార్డుదారుల అవస్థలు



కొరిటిపాడు (నాయుడుపేట) రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం పేద వర్గాల వారికి ఇచ్చే రేషన్‌కు గండి కొట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈకేవైసీ పెండింగ్ పేరుతో రేషన్ కార్డుదారులను దుకాణాల వద్దకు పిలిపిస్తున్నారు. ఒక వేళ ఈకేవైసీ ఈ నెలాఖరులోపు చేయించుకోకపోతే వారికి సరకులు నిలిపివేస్తామని స్పష్టంగా చెప్పడంతో దిక్కుతోచక దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గుంటూరు జిల్లాలో 5.99లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెల రేషన్ ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారు. ఈ రేషన్‌ను కూడా కట్ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నింది. ఈ నెలాఖరులోపు ఇంటిలో ఎంత మంది ఉన్నారో వారంతా రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని.. లేకపోతే సరకులు రావని సిబ్బంది చెప్పడంతో పలువురు పడిగాపులు కాస్తున్నారు.

సచివాలయంలో కాదని...

నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవల పరంగా ఎలాంటి ఇబ్బందులు లబ్ధిదారులు పడకూడదనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సదరు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఈకేవైసీ సచివాలయంలో కాకుండా రేషన్ షాపుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని కూటమి పాలకులు చెబుతున్నారు. చాలా మంది వృద్ధులు అవస్థలు పడుతూ రేషన్ షాపులకు వద్దకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

స్ట్రోక్ కేసుకు విజయవంతంగా చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్య బృందం

గుంటూరు మెడికల్ : స్ట్రోక్ కేసుకు గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో అధునాతన న్యూరోవాస్కులర్ విభాగం వారు విజయవంతంగా చికిత్స చేశారు. గురువారం మంగళదాస్‌నగర్‌లోని హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వైద్యులు వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. జిల్లాలోని మున్నంగివారిపాలెం చుండూరుకు చెందిన 76 సంవత్సరాల సాంబశివరావుకు బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారు. రోగికి కుడివైపు శరీర భాగం తరచూ బలహీనతకు గురికావడంతోపాటు అనేక ఇబ్బందులు ఉండటంతో న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి నేతృత్వంలో పరీక్షలు చేశారు. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే కరోటిడ్ ధమనులలో కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలు పేరుకుపోవడం (కరోటిడ్ ధమని వ్యాధి) గుర్తించారు. న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మణరావు నేతృత్వంలో బ్రెయిన్ ఆంజియోగ్రామ్ నిర్వహించి మెదడులో రక్తనాళం కూడా బలహీనపడి ఉబ్బినట్లు, బుడగల లాంటి పరిస్థితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో రోగికి చికిత్స అందించడం క్లిష్టతరంగా మారింది. డ్యూయల్ ఆంటీ ప్లేట్లెట్ తెరిపిన ఉపయోగించి రోగికి చికిత్స అందించాలని నిర్ణయించారు. న్యూరో ఇంటర్వెన్షనల్ స్పెషలిస్ట్ డాక్టర్ వివేక్, ఏకకాలంలో కరోటిడ్ ఆర్ట్ స్టెంటింగ్, అన్యూరిజం కాయిలింగ్ విధానాన్ని నిర్వహించి రోగి ప్రాణాలు కాపాడారు. కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో మల్టీ స్పెషాలిటీ విభాగాల పర్యవేక్షణలో నిపుణులైన వైద్య బృందం సేవలు అందిపుచ్చుకొని కేసును విజయవంతంగా నిర్వహించారని సీఓఓ సుధాకర్ జాదవ్ తెలిపారు. సమావేశంలో ఎమర్జెన్సీ మెడిసిన్ రాజశేఖర్ మాలెంపాటి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ బలోపేతానికి కృషి



డాక్టర్ హరికృష్ణను సన్మానిస్తున్న సంఘ నేతలు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్‌కు ఘనమైన చరిత్ర ఉందని, బలోపేతానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.వి.హరికృష్ణ పేర్కొన్నారు. ఫెడరేషన్ సమావేశం స్థానిక అరండల్‌పేట సాయి వెంకట ఫిజియోథెరపీ అండ్ ఆక్యుపంచర్ క్లినిక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఫిజియోథెరపీ సేవలు కీలక భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా ఫెడరేషన్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. వైద్యులు సతీష్ కుమార్, దయాకర్ , రాజేంద్ర ప్రసాద్, ఇమ్రాన్ ఖాన్, ఏడుకొండలు, ఖాజా, గ్రేస్, మురళీధర్, వినుకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

66 మందికి ఉద్యోగాలు

గుంటూరు ఎడ్యుకేషన్ అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం చెన్నైకు చెందిన ఇండియన్ హెల్త్‌కేర్ బీపీవో సంస్థ నిర్వహించిన పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో 66 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీ నాగభూషణం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 77 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 66 మందిని మెడికల్ కోడింగ్ ఎగ్జిక్యూటివ్, మెడికల్ బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులకు వారం రోజుల్లో జాబ్ ఆఫర్ పత్రాలు పంపుతారని తెలిపారు.

రహదారి పనులు ప్రారంభించాలి



ఏటీ అగ్రహారంలో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ పెండింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని, విద్యుత్ స్తంభాలను తరలించేలా సమన్వయం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ ఏటీ అగ్రహారం, శాంతి నగర్, లక్ష్మీనగర్, చుట్టగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్‌లో పెండింగ్ రోడ్ పోర్షన్ నిర్మాణానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. రోడ్‌కి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపునకు ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్ విస్తరణలో ఉన్న కోర్టు కేసుల వివరాలతో నివేదిక ఇవ్వాలని ఏసీపీని ఆదేశించారు. కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర పీకలవాగును పరిశీలించారు. చుట్టు పక్కల కమర్షియల్ సంస్థల నుంచి వ్యర్థాలు వేయకుండా చూడాలని, ఇలా వేసే వారిపై జరిమానా విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు ప్రతి రోజు తమ సచివాలయం పరిధిలో అనధికార కట్టడాలు, ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను ప్రతి రోజు డ్రోన్ ద్వారా నేరుగా పరిశీలిస్తామన్నారు. తమ పరిశీలనలో అనధికార కట్టడాలు గుర్తిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏటీ అగ్రహారం 3వ లైన్లో ఖాళీ స్థలంలో వ్యర్థాలు వేయడం గమనించి, సదరు యజమానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం 4వ లైన్‌లో డ్రెయిన్‌ని పరిశీలించారు. మెయిన్ డ్రెయిన్‌లోకి అనుసంధానం చేయడానికి చర్యలు తీసుకోవాలని డీఈఈని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈ మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నగర పాలక సంస్థలో పని చేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్ ఈ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విభాగాల వారీగా గ్రీవెన్స్ నిర్వహిస్తామని చెప్పారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాధిపతులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా, విభాగ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.15 కోట్లు ఆస్తిపన్ను వసూలు

నెహ్రూ నగర్ ఆస్తి పన్ను చెల్లించటానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున గురువారం 2600 మంది వడ్డీ రాయితీని సద్వినియోగపరచుకొని రూ.3.15 కోట్లు పన్ను చెల్లించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8 కౌంటర్లు, సర్కిల్ కార్యాలయాల్లో 5 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



లక్ష్మీపురం: పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడంలో నిజమైన సంతృప్తి ఉందని నగరంలోని 39వ కార్పొరేటర్ రుస్తుంబాబు అన్నారు. గురువారం ఉదయం స్థానిక గుజ్జనగుండ్లలో అల్ మదత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 300 మందికి ఉచితంగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమానికి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుభాని షేక్ మీరావలి అధ్యక్షత వహించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అందరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు. షేక్ మదార్ వలి, షేక్ రషీద్, షేక్ మస్తాన్‌వలి, షేక్ రసూల్ పాల్గొన్నారు.

పోలవరంలో అవినీతిపై సీబీఐ విచారణేదీ?

– విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): పోలవరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ ఏదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ ప్రశ్నించారు. గుంటూరు నగరం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబులో ఆవేదన కనిపించిందన్నారు. రాష్ట్రంలో పోలవరం డయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యాం పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారని, పోలవరం ఏటీఎంలా మారిందని ప్రధాని గతంలో చెప్పారన్నారు. దీనిపై విచారణ ఎందుకు వేయలేకపోతున్నారని ప్రశ్నించారు. బీటెక్ పాసైన వారు కూలి పనులకు, ఎంబీఏ పాసైన వారు డ్రైవర్లుగా వెళ్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఉద్యోగాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకే స్టడీ టూర్లు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు పెద్ద లీడర్లతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. తగిన సమయం వచ్చినప్పుడు వారంతా కాంగ్రెస్‌లోకి వస్తారని తెలిపారు. చిలకలూరిపేటకు చెందిన ఒక మాజీ ఎమ్మెల్యేపై కొంత నగదు తీసుకున్నారనే ఆరోపణలపై ఏసీబీ విచారణకు పాలకులు ఆదేశించారని గుర్తుచేశారు. కానీ రూ.వేల కోట్లను పోలవరం పేరిట దోచుకుతిన్నారని ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ అనుకుంటుంటే, సీబీఐ విచారణ కాదు కదా, కనీసం ఏసీబీ విచారణ కూడా జరిపించకపోవడంలో అంతర్యమేంటోననే విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యాసంస్థల నిర్లక్ష్యంపై చర్యలకు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

లక్ష్మీపురం: విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. బ్రాడీపేట 2/7లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ.. పట్టాభిపురం నారాయణ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వి. ఓం సాయిరెడ్డి 40 రోజుల క్రితం పాఠశాల హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడని చెప్పారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఇంతవరకు ఆ విద్యార్థి ఆచూకీ లభించలేదని గుర్తుచేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం క్రాంతీజ్ రిక్రియేషన్స్ ఫౌండేషన్ సహకారంతో ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎద్దుల అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి టి.సంపత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ మాయకుంట్ల సురేష్, సీఏ మాదాసు వినయ్‌కుమార్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.